ప్రజాశక్తి
శనివారం 30 సెప్టెంబర్ 2023
5
విజయనగరం

జిపిఎస్ ప్రతులు దగ్ధం

జిపిఎస్ ప్రతులు దగ్ధం చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట :పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి జిపిఎస్ బిల్లు ప్రతులను సిపిఎం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన ఉద్యోగులు, ఉపాధ్యాయులు దగ్ధం చేశారు. ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను తేవాలని వారు డిమాండ్ చేశారు. జిపిఎస్ వల్ల ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రయోజనమేమీ లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎ.రాము, జి.గణేష్ నాయుడు, పిఎన్ మూర్తి, కె.కృష్ణ, ఎన్.వెంకటరమణ, ఎం.తులసిరామ్, టి.రవికుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు జి.వెంకట్రావు, జివి రమణ, ఎంవిఎస్ నారాయణ, ఎం.కొండలరావు, గొల్లు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కౌలురైతులకు బ్యాంకుల నుంచి పంట రుణాలు అందలేదు. సిసిఆర్‌సి (క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు)లు కూడా అరకొరగానే ఇచ్చారు. దీంతో కౌలు రైతులను ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. అప్పులు చేసి వరినాట్లు వేసినా, వాటిని బతికించుకోవడానికి ఎరువులు కొనుక్కోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కౌలుదార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌలురైతులకు అందని రుణాలు

అరకొరగా సిసిఆర్ కార్డులు ● ఆర్థిక ఇబ్బందుల్లో కౌలుదారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా సుమారు 2.61 లక్షల మంది రైతులు ఉన్నట్టుగా అధికారులు చెబుతున్నారు. వీరిలో 2,58,324 మంది రైతులకు భరోసా అందుతోంది. మిగిలిన 3 వేల మంది పెద్ద రైతులు కాబట్టి రైతు భరోసా అందడం లేదు. ఇదీ సర్కారువారి లెక్క. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలో సుమారు 3 లక్షలకుపైగా రైతులు ఉన్నారు. వీరిలో సుమారు 90 వేల మంది (30 శాతం) కౌలు రైతులు ఉన్నారని ఎపి రైతు సంఘం లెక్క. వాస్తవ పరిస్థితులు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. జిల్లాలో దేవాదాయ శాఖ, మాన్సాస్ భూములు, మొకాసో, నాలావారీ భూములు వేలాది ఎకరాలు ఉన్నాయి. ఇవన్నీ లీజుపద్ధతిలోనే సాగవుతున్నాయి. చిన్న, సన్నకారు రైతులు సాగుచేసుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నారు. ఇక పెద్దరైతులు సుమారు 3 వేల మంది వరకు ఉన్నారని సాక్షాత్తూ అధికారులే చెబుతున్నారు. వీరంతా వర్షాధార భూములను ఏకకాలంలో పండించే పరిస్థితి లేదు. ఇందులో కనీసం సగం మంది అంటే 1500 మంది వరకూ తమ భూములను కౌలుకు ఇచ్చారు. పూర్తిగా కౌలుకు ఇచ్చిన యజమానులూ అక్కడక్కడ ఉన్నారు. అధికారులు మాత్రం పంచ పాండవులు ఎంతమంది అంటే మంచం కోళ్ల మాదిరిగా ముగ్గురేనంటూ రెండు వేళ్లు చూపించి ఒకటి మూసేసి, మరొక వేలిని చూపించిన చందంగా, 11,195 మందిని మాత్రమే కౌలుదారులుగా గుర్తించి సిసిఆర్ కార్డులు అందజేశారు. వీరందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరుతూ బ్యాంకులకు ఇప్పటికే జాబితాలను పంపామని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీరిలో ఎంతమందికి రుణసాయం అందిందన్న దానిపై అధికారులు తెల్లముఖం వేస్తున్నారు. దీన్నిబట్టి ఆచరణలో ఒక్క కౌలురైతుకీ బ్యాంకు రుణం అందడం లేదన్నది స్పష్టమౌతోంది. బ్యాంకు నిబంధనలు, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే ఇందుకు కారణం. పంట రుణాలకు 1బి పత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు తప్పనిసరి. సాధారణంగా ఆయా పత్రాలు భూమి యజమానులకే అందుబాటులో ఉంటాయి. రైతులు పంట రుణాల కోసం వచ్చినప్పుడు 1బిలో ఉన్న మొత్తం భూమి విస్తీర్ణాన్ని హోల్డ్ చేసి నగదు చెల్లింపులు చేస్తామని సాక్షాత్తూ బ్యాంకు అధికారులే చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అదే ఖాతా నంబరుతో ఆ తరువాత కౌలుదారుడు వచ్చినా రుణసాయం అందించేందుకు అవకాశం ఉండదని కూడా చెబుతున్నారు. దీన్నిబట్టి ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో బ్యాంకు నిబంధనల సడలింపు కోసం ప్రయత్నించడం, లేదా ప్రభుత్వమే బ్యాంకర్లకు హామీ ఇవ్వడం వంటి చర్యలు తీసుకుంటే మినహా కౌలురైతులకు న్యాయం జరిగే అవకాశం కనిపించడం లేదు.

తమ భూముల్లోకి వెళ్లిన జెసిబికి అడ్డంగా నిలుచున్న రైతులు

విమానాశ్రయ అప్రోచ్ రోడ్డుకు భూసేకరణ అడ్డగింత

పరిహారం అందజేసి భూముల్లోకి రావాలన్న రైతులు

ప్రజాశక్తి-భోగాపురం

విమానాశ్రయ అప్రోచ్‌రోడ్డు భూసేకరణకు సంబంధించి మండలంలో బైరెడ్డిపాలెం వద్ద శుక్రవారం వివాదం చోటుచేసుకుంది. విమానాశ్రయ అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అధికారులు 39 ఎకరాలను సేకరించారు. ఇందులో చాలామంది రైతులకు పరిహారం ఇవ్వకుండా విశాఖపట్నంలోని భూ సేకరణ రీహబిటేషన్, రీసెటిల్మెంట్ ట్రిబ్యునల్ అథారిటీలో జమ చేసేశారు. ప్రస్తుతం రైతులంతా ఆ ట్రిబ్యునల్ కోర్టులో తిరుగుతున్నారు. ఇంతలో శుక్రవారం ఆర్‌డిఒ సూర్యకళ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సంబంధిత భూముల్లో చెట్లు తొలగించే పనులు చేపట్టేందుకు వెళ్లారు. రైతులు జెసిబిలు వెళ్లకుండా అడ్డుకున్నారు. రెవెన్యూ సిబ్బంది, అధికారులు, సివిల్ డ్రెస్‌లో ఉన్న ఇద్దరు పోలీసు సిబ్బంది రైతులను పక్కకు నెట్టి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం కేవలం పరిహారం అందించిన భూముల్లోనే చెట్లు తొలగిస్తామని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎంత నష్టపరిహారం వస్తుందో తమకు తెలియకుండానే ట్రిబ్యునల్ కోర్టులో జమ చేశారని తెలిపారు. పరిహారం ఇవ్వకుండా బలవంతంగా భూముల్లోకి వచ్చి తమ చెట్లను తొలగిస్తున్నారని అధికారులను నిలదీశారు.

భారీగా పోలీసులను సిద్ధం చేసి..

సిఐ బివి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాలుగు మండలాల ఎస్ఐలతోపాటు భారీగా పోలీసు సిబ్బందిని భోగాపురం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిద్ధం చేశారు. ముందుగా వెళ్తే రైతులను రెచ్చగొట్టే విధంగా ఉంటుందనే ఉద్దేశంతో పోలీసులు ఎవరూ తొలుత అక్కడికి రాలేదు. ఒకవేళ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడితే పంపించేందుకు వీరిని సిద్ధం చేసి ఉంచారు. కేవలం పరిహారం అందజేసిన భూముల్లోనే చెట్లు తొలగించడంతో రైతులు కొంత శాంతించారు. ట్రిబ్యునల్ అథారిటీలో పరిహారం జమ చేసిన రైతుల భూముల్లో కూడా చెట్లను రెండు, మూడు రోజుల్లో తొలగించేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. అదే జరిగితే రైతులు దీన్ని అడ్డుకునేందుకు సిద్ధమవుతున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బంగార్రాజు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై

5న విశాఖలో బహిరంగ సభ

విజయవంతం చేయాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, రెడ్డి శంకరరావు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 5న విశాఖపట్నంలోని కూర్మన్న పాలెంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపుని చ్చారు. శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ లక్ష మందికి ఉపాధి కల్పిస్తోందని, మరో 25 వేల ఉద్యోగాలకు అవకాశం ఉందని వెల్లడించారు. విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. అలాంటి పరిశ్రమను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మకానికి పెట్టడం సరికాదన్నారు. ఈ ప్రజాద్రోహ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉక్కు సంకల్పంతో స్టీల్‌ప్లాంటు కార్మికులు, కార్మిక, ప్రజాసంఘాలు 950 రోజులకు పైగా పోరాడుతున్నట్లు తెలిపారు. స్టీల్ ప్లాంటును కాపాడాల్సిన అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, అన్యాయాన్ని ప్రశ్నిస్తానన్న జనసేన పార్టీ... మోడీ ముందు సాగిలపడుతున్నాయని విమర్శించారు. ద్రోహం చేస్తున్న బిజెపిని వదిలేసి అధికార యావతో తమలో తాము కలహించు కుంటున్నారని ఆక్షేపించారు. ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోవడానికి సిపిఎం ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంటు రక్షణ ఉద్యమం ప్రారంభించినట్లు తెలిపారు. అందులో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ నెల 20 నుంచి బైక్ ర్యాలీ చేపట్టినట్లు వెల్లడించారు. ముగింపుగా అక్టోబర్ 5న స్టీల్‌ప్లాంట్ ముందు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నా మని, దీనికి ముఖ్యవక్తగా సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవు తున్నారని తెలిపారు. బహిరంగ సభకు జిల్లా ప్రజానీకం తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పాల్గొన్నారు.

అధికారుల అండ ఉండగా..

ప్లానుతో పనేముంది?

● అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం ● ప్రభుత్వ ఆదాయానికి గండి
● మొక్కుబడిగా మారుతున్న సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీల పనితీరు

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇల్లు

వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఫర్వాలేదన్న చందంగా తయారైంది పంచాయతీ ప్రణాళికా విభాగం పనితీరు. పట్టణంలో చేపట్టిన పలు అక్రమ కట్టడాల వ్యవహారం అందుకు నిదర్శనం. అధికారులకు కొట్టాల్సిన ఆమ్యామ్యాలు కొడితే ప్లాన్‌తో పని లేకుండా ఎలాంటి నిర్మాణాలైనా చేపట్టుకోవచ్చనే ప్రచారం సాగుతోంది. పట్టణంలో జరిగే పలు అక్రమ కట్టడాలలో మచ్చుకు కొన్ని పరిశీలిస్తే అధికారుల పనిలో డొల్లతనం బాహాటంగా కనిపిస్తోంది.

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని రామ్‌నగర్‌లో డిఎఫ్‌సి వెనుక పట్టణానికి చెందిన ఒక వ్యాపారి గ్రౌండ్‌ఫ్లోర్‌లో వ్యాపార ఏజెన్సీ సముదాయానికి, పై అంతస్తుల్లో ఇల్లు నిర్మిస్తున్నాడు. తీసుకున్న ప్లానుకు, నిర్మిస్తున్న కట్టడానికి సంబంధమే లేదు. నాలుగు అంతస్తుల భవన నిర్మాణం అక్రమంగా జరుగుతుంది. ప్లాను అనుమతులకు విరుద్ధంగా భవన నిర్మాణం చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. లక్షల్లో డబ్బులు అధికారులకు, స్థానికంగా కొంతమంది విలేకరులకు చెల్లించామని, వారే అన్ని చూసుకుంటారని భవన యజమాని తెలపడం గమనార్హం. అవినీతిని నిర్మూలించి ఎండగట్టాల్సిన వారే అవినీతిపరులకు ఇలా కొమ్ముకాస్తుంటే న్యాయం అంతమైపోతుందేమోనని పలువురు సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పరిశీలనకు వెళ్ళినప్పుడు ప్లానులో ఉన్న లోపాలను వారికి అనుకూలంగా మార్చుకొని అక్రమాలకు ఊతమిస్తున్నారనేది బహిర్గతమే. ఈ అక్రమ కట్టడాలను అవకాశం వచ్చినప్పుడు సక్రమ కట్టడాలుగా ఎలా మార్చుకోవచ్చునో అధికారులే సూచనలు ఇస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఈ విషయమే జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసేందుకు వారు సిద్ధమవుతున్నారు.

జి ప్లస్‌టుకు మాత్రమే అనుమతి

రామ్‌నగర్‌లో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసి వెళ్లి పరిశీలించాం. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడం వాస్తవమే. యజమానికి జిప్లస్‌టు నిర్మాణానికి మాత్రమే అనుమతులున్నాయి. అదనపు నిర్మాణానికి ఇంటి యజమానికి నోటీసులు కూడా ఇచ్చాం. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వారి సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటాం.

- సిహెచ్.కన్నబాబు, మేజర్ పంచాయతీ ఇఒ

నిర్బంధంపై అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ శుక్రవారం విజయనగరం అర్బన్ 3, 4 సెక్టార్ల వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడీల సమస్యలపై చర్చించాలని శాంతియుతంగా చలో విజయ వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తే నిర్బంధాలకు, అరెస్టులకు పాల్పడటం దారుణమన్నారు. మహిళలని చూడకుండా అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లి దాడులు చేయడం అప్రజాస్వామికమని ఖండించారు. నిర్బంధాల ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని చూడటం ఎవరి తరమూ కాదని, సిఎం జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలు అమలు చేయమని కోరడం నేరమా? అని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26 వేలు, పింఛనుతో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి విశాలాక్షి, సెక్టార్ నాయకులు ప్రసన్న, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

'ప్రొఫెనోఫోస్ 50 శాతం'పై నిషేధం

విజయనగరం : అగస్త్య ఆగ్రో లిమిటెడ్‌కు చెందిన బ్యాచ్ నంబర్ పిఎఫ్‌టి2301520 గల ప్రొఫెనోఫోస్ 50 శాతం పురుగుల మందును నిషేధించినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి విటి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మందు విశాఖపట్నంలోని రీజనల్ కోడింగ్ సెంటర్‌లో నాసిరకంగా నమోదైనట్లు చెప్పారు. అందువల్ల పై బ్యాచ్‌కు చెందిన ప్రొఫెనోఫోస్ 50 శాతం పురుగుల మందును నిల్వ చేయడం, విక్రయించడం నిషేధమని స్పష్టంచేశారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

14,568 మంది వాహనదారులకు లబ్ధి

ప్రజాశక్తి-విజయనగరం

వైఎస్ఆర్ వాహనమిత్ర ఐదో విడతలో జిల్లాలో 14,568 మంది వాహనదారులకు లబ్ధి చేకూరింది. రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని వారి ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయవాడ నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెసి మయూర్ అశోక్, రవాణా శాఖ ఉప కమిషనర్ జి.ఆర్.రవీంద్రనాథ్, జిల్లా రవాణా అధికారి ఎన్.రమేష్, ఎంవిఐలు వీక్షించారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జెసి మయూర్ అశోక్ మీడియాతో మాట్లాడుతూ ఐదో విడతలో జిల్లాలో 14,568 మంది లబ్ధిదారులకు రూ.14.56 కోట్లను అందజేసినట్లు తెలిపారు. గత నాలుగు విడతల్లో కలుపుకొని మొత్తం 71,410 మందికి 71.41 కోట్ల రూపాయలు అందించినట్లు వివరించారు.



చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ఎన్నికలకు సన్నద్ధం కండి

● చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
● వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'ఐదారు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఇప్పటి నుంచే ఎన్నికలకు సన్నద్ధం కావాలి. గత నాలుగున్నరేళ్లు ఒక ఎత్తు. రానున్న రోజుల్లో మరింత కష్టపడి, ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను తెలియజేయాలి. వైసిపిని గెలిపించాలి' అని ఆ పార్టీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. 'ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి' అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. శుక్రవారం నగరంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు అవినీతికి ఏ విధంగా పాల్పడ్డారు, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను ఎలా మోసం చేశారో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీల కంటే ఇంకా ఎక్కువగా సంక్షేమం, అభివృద్ధి చేస్తోన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో వైసిపి నాయకుల్లో సమన్వయం కొరవడిందని, ఎమ్మెల్యేలు చక్రవర్తులు మాదిరిగా, ఎంపిపిలు సామంతులు మాదిరిగా చలామణి అవుతున్నారని మంత్రి చురకలంటించారు. అలాంటి పద్ధతి మార్చుకోవాలని హితవుపలికారు.

డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో మాయ మాటలు, అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసేందుకు టిడిపి చూస్తోందన్నారు. అవినీతిపరులకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మౌనికను అభినందిస్తున్న టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రతినిధులు

అంతర్జాతీయ టెన్నికాయిట్ పోటీలకు మౌనిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని కెఎల్‌పురానికి చెందిన రెడ్డి మౌనిక అంతర్జాతీయ టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైంది. దక్షిణాఫ్రికాలో అక్టోబరు ఒకటో తేది నుంచి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. మౌనికను జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు, చైర్మన్ జమ్ము శ్రీను, కార్యదర్శి రామారావు అభినందించారు. మౌనిక ప్రయాణ నిమిత్తం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆర్థిక సహాయం చేశారు.

కిక్ బాక్సింగ్ పోటీలకు రిఫరీగా మహేష్

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు నెల్లిమర్లకు చెందిన టైగర్ మహేష్ రిఫరీగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నగరంలోని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని ఆయన నివాసంలో కలిశారు. మహేష్‌ను కోలగట్ల అభినందించి, సత్కరించారు. క్రీడల్లో విజయనగరం జిల్లా అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని సాధించడం మనమంతా గర్వించదగిన విషయమని కోలగట్ల పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు విశేష స్పందన

అండర్-19 జిల్లా ఫుట్‌బాల్ పోటీలకు విశేష స్పందన లభించింది. శుక్రవారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు అధిక సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం అక్టోబర్ 7 నుంచి మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్ఎన్ కృష్ణ తెలిపారు. 18 మందితో ఒక్కో జట్టును ఎంపిక చేసినట్లు చెప్పారు.

పోలీసు సంక్షేమ దివస్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి దీపిక శుక్రవారం పోలీసు సంక్షేమ దివస్‌ను ఏర్పాటుచేశారు. జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న పోలీసు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు ఉద్యోగుల నుంచి ఎస్‌పి దీపిక వినతులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

నేటి నుంచి ఇంటింటికీ జనసేన

విజయనగరం టౌన్ : జనసేన విధానాలను, సిద్ధాంతాలను వివరించి ప్రజలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా ఇంటింటికీ జనసేన కార్యక్రమాన్ని శనివారం నుంచి ప్రారంభిస్తున్నామని ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఇంటింటికీ జనసేన కార్యక్రమం కరపత్రాలను, టి షర్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ సిద్ధాంతాలను, భావజాలాన్ని, సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. టిడిపి -జనసేన కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు ఏ రకమైన పరిపాలన అందిస్తుందనే విషయంపై ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులకు విన్నవిస్తూ పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డి.రామచంద్రరాజు, రౌతు సతీష్, కాటం అశ్వని, మాతా గాయిత్రి, పుష్పకుమారి పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా చెరువులు

విజయనగరం టౌన్ : నగరంలోని చెరువులను అభివృద్ధి చేసి, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. నగరంలోని పెద్దచెరువు, అయ్యకోనేరు, నీలాటి చెరువులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పెద్ద చెరువు వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులు ఏమేరకు వచ్చాయో, వాటి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. నీలాటి చెరువు వద్ద విద్యుత్తులైట్లను ఆకతాయిలు దొంగలించారని, ఈ విషయమై సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. చెరువుల పరిశీలన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అయ్యకోనేరు అభివృద్ధి చేయడం ద్వారా వాకింగ్ చేసే వారి సంఖ్య పెరిగిందన్నారు. దాసన్నపేట వద్దనున్న నీలాటి చెరువును అభివృద్ధి చేసి విద్యుత్తు దీపాలతో కాంతిలీనం చేయడంతో కొత్త అందాలను సంతరించుకుందని చెప్పారు. కార్యక్రమంలో ఇఇ శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, వైసిపి నాయకులు యడ్ల రాజేష్, బొద్దూరు లక్ష్మణరావు, బలివాడ కిరణ్ పాల్గొన్నారు.

లక్ష్మీపేట కేసు 6కి వాయిదా

వంగర : మండలంలోని లక్ష్మీపేట ఘటన కేసు అక్టోబర్ 6కి వాయిదా పడింది. శ్రీకాకుళం కోర్టు జడ్జి లక్ష్మీపేట ప్రత్యేక కోర్టులో శుక్రవారం విచారణ చేపట్టి వాయిదా వేశారు. మొత్తం 80 మంది నిందితులకు గాను 12 మంది మృతి చెందగా, 45 మంది హాజరయ్యారు మిగతా 23 మంది గైర్హాజరయ్యారు. వంగర ఎస్ఐ ఆర్ జనార్దన రావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

డిగ్రీ కళాశాలలో ఆకస్మిక తనిఖీ

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా అధ్యాపకులకు టిఎల్‌పి, స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్, క్యాంపస్ నియామకాలు గురించి చర్చించారు. కమిషనర్ విద్యార్థులతో ముఖాముఖీలో పాల్గొని వారికి సింగిల్ మేజర్ సబ్జెక్ట్ యొక్క ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కళాశాలలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు, వైస్ ప్రిన్సిపల్ వాసుదేవరావు, షేక్ వలీ ఖాన్, స్వామి నాయుడు, భాస్కర్ రావు, రాజు, సంతోష్ కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సవరవల్లిలో రుణమేళా

భోగాపురం: మండలంలోని సవరవల్లి గ్రామంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రాజాపులోవ శాఖ ఆధ్వర్యంలో రుణమేళాను వెలుగు సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 18 స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రూపంలో రూ.15.60 కోట్లు అందజేసినట్లు ఎపిఎం రమణ తెలిపారు. సంబంధిత చెక్కును సంఘాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పాడ విజయ భాస్కర్ రెడ్డి, ఎంపిటిసి పట్నా తాతయ్యలు, బ్యాంకు మేనేజర్ గిరిజా శంకర్ సాహు, ఫీల్డ్ ఆఫీసర్ వల్లూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల సమస్యపై అధికారులకు ఫిర్యాదు

భోగాపురం : మండలంలోని ముంజేరు పంచాయతీ జగ్గయ్యపేట గ్రామంలో పారిశుధ్యం, కాలువల సమస్యపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జనసేన మండల అధ్యక్షుడు వందనాల రమణ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, గ్రామంలో డ్రైనేజీ సదుపాయం లేక వాడుక నీరు రోడ్లపై నిలిచిపోతూ దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు. పలుమార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని తెలిపారు.

పాత పింఛను విధానాన్నే కొనసాగించాలి

రామభద్రపురం: సిఎం జగన్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పాత ఫించన్ విధానాన్నే కొనసాగించాలని, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఎపిటిఎఫ్ కౌన్సిల్ మెంబర్ మడక బలరాం నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి గత ఎన్నికల ముందు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చారని, ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన వారం లోపే సిపియస్ రద్దు పరిచి పాత ఫించన్ విధానాన్ని కొనసాగిస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పారన్నారు.

నియామక పత్రం అందజేత

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం, వెదురువాడ గ్రామ పంచాయతీలకు నూతనంగా ఎంపికైన వాలంటీర్లు ఎం.నాగమణి, ఎన్.శ్రవణ్ కుమార్‌లకు ఎంపిపి చల్ల చలంనాయుడు శుక్రవారం నియామక పత్రాలను అందించారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రామ్‌లో భాగంగా కనిమెరక గ్రామానికి చెందిన సాయిబాబా గ్రూప్ సభ్యులు కసిరెడ్డి సత్యవతికి మగ్గం వర్క్ మిషన్ యూనిట్‌కు రూ.5 లక్షలు చెక్‌ను ఎంపిపి చల్ల చలం నాయుడు, జెడ్పిటిసి రాపాక సూర్య ప్రకాశరావులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్, ఎపిఎం సులోచనా పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ పరిశీలన

బొబ్బిలిరూరల్ : మండలంలోని కమ్మువలస రెవెన్యూ గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రైతులకు పంపిణీ చేయవలసిన జగనన్న భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని తహశీల్దార్ డి. రాజేశ్వర రావు శుక్రవారం పర్యవేక్షించారు. జగనన్న భూ హక్కు పత్రాలను రైతులకు నేరుగా ఇకెవైసి చేసి పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి అప్పయ్య పాల్గొన్నారు.

16వ వార్డులో అభివృద్ధి పనులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట 16వ వార్డు లక్ష్మీదేవి పేటలో శుక్రవారం వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్ పాండ్రంకి సత్యవతి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. వార్డులో తాగు నీటి ఇబ్బందులు ఉన్నాయని, మరికొన్ని ప్రాంతాల్లో సిసి రోడ్లు వేయాల్సి ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ డిసెంబర్‌లోగా మిగతా అభివృధి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మద్దిల వాసు, పాండ్రంకి సత్యనారాయణ, తుమ్ము నారాయణ మూర్తి పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష

నెల్లిమర్ల : గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 నుంచి గ్రామాల్లో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందనీ ఆయా గ్రామాల్లో ప్రజల ఆరోగ్య స్థితి గతులు తెలుసుకొని వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.రామారావు, తహశీల్దార్ డి. ధర్మరాజు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ 8వ వార్డు సచివాలయాల పరిధిలో వార్డు వాలంటీర్ పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 14 పోస్టుల భర్తీకి కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జారీచేసిన నోటిఫికేషన్ మేరకు ఆన్‌లైన్ ద్వారా 31 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసినట్లు తెలిపారు. ఎంపికైన వాలంటీర్ల జాబితా 30న ప్రకటిస్తామని ఎంపికైన వారు అక్టోబర్ 1న విధులకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ టి.వి.యస్.విశ్వేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎ. రాజ్యలక్ష్మి, సీనియర్ సహాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

బొబ్బిలి : మున్సిపాలిటీలోని జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు సచివాలయ, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

డెంకాడ : ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల్లో పాల్గొని ప్రారంభించాలని నియోజకవర్గ జెఎస్ నోడల్ అధికారి డాక్టర్ ఆర్ అచ్యుతకుమారి ఆధ్వర్యంలో నాలుగు మండలాల డాక్టర్ల బృందం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు ఆహ్వానాన్ని ఆయన స్వగృహంలో శుక్రవారం అందించారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, మోపాడ, పూసపాటిరేగ డాక్టర్లు పీవీ వియోగిత, రాజేష్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి తీరనిలోటు

నెల్లిమర్ల: వ్యవసాయ శాస్త్రవేత్త స్వామి నాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అనేక రకాల పరిశోధనలు చేసిన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ మృతి రైతులకు, వ్యవసాయ రంగానికి తీరని లోటన్నారు. ఆయన వ్యవసాయంలో హరిత విప్లవాన్ని తీసుకు వచ్చి భవిష్యత్ తరాలకు దారి చూపిన వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- గజపతినగరం

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం చలో స్టీల్ ప్లాంట్ బహిరంగ సభ అక్టోబర్ 5 సాయంకాలం నాలుగు గంటలకు స్టీల్ ప్లాంట్ ఆర్చ్ కూర్మన్నపాలెం వద్ద జరుగుతుందని ఈ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, రాకోటి రాములు కోరారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు సిపిఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు చాలా కీలకమైన స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవలసిన బాధ్యత ప్రజపై ఉందన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణకై వెయ్యి రోజులుగా విశాఖపట్నంలో ఉద్యోగులు కార్మికులు, ప్రజా సంఘాలు, అనేక రాజకీయ పార్టీలు, ఉద్యమ శ్రేయోభిలాషులు అందరూ పోరాడుతున్నారని చెప్పారు. గత 12 రోజులుగా సిపిఎం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాలలో బైక్ ర్యాలీ జరుగుతుందని, దీని కొనసాగింపుగా ఈ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. ప్రజలంతా పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గజపతినగరం: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

రాజాం: విశాఖ ఉక్కు రక్షణకై ఛలో స్టీల్ ప్లాంట్ వద్ద అక్టోబర్ 5న జరుగు బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం రాజాంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గురువులు, కాశీ, సత్యారావు, శ్రీనివాసరావు, లక్ష్మి, మల్లమ్మ, గౌరి, రాంబాబు పాల్గొన్నారు.

బొబ్బిలి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వచ్చేనెల 5న విశాఖ కూర్మన్నపాలెం విశాఖ ఉక్కు గేటు వద్ద జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు పి.శంకరరావు, ఎస్.గోపాలం కోరారు. బహిరంగ సభ గోడ పత్రికలను శుక్రవారం సిఐటియు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో 10రోజులు ఉక్కు రక్షణ యాత్ర చేపట్టినట్లు చెప్పారు. బహిరంగ సభకు కార్మికులు, ప్రజలు, రైతులు, యువత హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

జిపిఎస్ ప్రతులు దగ్ధం

శృంగవరపుకోట: ప్రభుత్వం అసెంబ్లీలో జిపిఎస్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించినందుకు నిరసనగా శుక్రవారం రాత్రి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జిపిఎస్ బిల్లు ప్రతులను ఉపాధ్యాయులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ నాయకులు ఎ రాము, జి గణేష్ నాయుడు, పిఎస్ మూర్తి, కె. కృష్ణ, ఎస్ వెంకటరమణ, ఎం తులసీరామ్, టి రవికుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు జి వెంకట్రావు, జి వి రమణ, ఎం వి ఎస్ నారాయణ, ఎం కొండల రావు, గొల్ల సూరిబాబు, బి అప్పారావు, ఎ శ్రీనివాస్, డి తిరుపతి రావు, ఎవి లక్ష్మి బి కమల, డి అఖిల రాణి, ఎస్‌కె బేగం తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

బొద్దాంలో గడపగడపకు..

వేపాడ : మండలంలోని బొద్దాంలో శుక్రవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కచ్చితంగా మరోసారి జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు జగన్నాథం, సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి దీక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంద్రబాబు అరెస్టుపై టిడిపి రిలే నిరాహారదీక్షలు శుక్రవారం కొనసాగాయి. దీక్షా శిబిరంలో విశ్వబ్రాహ్మణ సోదరులు మల్లేష్ కుర్మారావు, రామచంద్రతోపాటు పలువురు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగార్రాజు, సీనియర్ నాయకులు మహంతి చిన్నంనాయుడు, సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, పతివాడ తమ్మినాయుడు, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, విక్రమ్ జగన్నాథం, పిన్నింటి రమేష్ నాయుడు, గురాన చక్రధర్, చింతపల్లి వెంకటరమణ, కింతాడ కళావతి, పసుపులేటి గోపి, దన్నాన రామ్మూర్తి, కాళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **డెంకాడ:** మండంలోని మోదవలస, బంగార్రాజుపేట, కొండ్రాజుపేట గ్రామాల టిడిపి నాయకులు ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్‌రావు, కలిదిండి పాణీరాజు, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, కొండరాజుపేట మాజీ సర్పంచ్ సరగడ లక్ష్మి, ముని పైడయ్య, ఎర్నింటి రాము, ఎర్నింటి శ్రీను, కనకల వెంకటరమణ, అల్లబోయిన వెంకటరమణ, చెల్లబోయిన అప్పయ్యమ్మ, బూర్లి రవి, బంటుపల్లి విజయ్‌కుమార్, కాగితాల బాలు, కంది గంగాధర్, బుగత రమణ తదితరులు పాల్గొన్నారు. **పూసపాటిరేగ:** మండలంలోని కనిమెల్ల టిడిపి సీనియర్ నాయకులు దంతులూరి సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో టిడిపి నేతలు కామవరం నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కందివలస సాయిబాబా ఆలయానికి శుక్రవారం పాదయాత్రగా వెళ్లారు. పాదయాత్రకు టిడిపి నాయకులు ఆకిరి ప్రసాదరావు, కూనిశెట్టి గోవింద, ముత్యాల వెంకట రమణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నడిపేన అప్పలస్వామినాయుడు, దుర్గసి సూర్యారావు, నడిపేన రమేష్, లంకలపల్లి శ్రీను, జోగులు తదితరులు పాల్గొన్నారు. **బొబ్బిలి:** చంద్రబాబు అరెస్టు దుర్మార్గమని నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. 17వ రోజు శుక్రవారం నిరసన దీక్షలు కొనసాగాయి. దీక్షలను బేబినాయన ప్రారంభించారు. దీక్షలలో కృష్ణాపురం, జగన్నాధపురం నాయకులు కూర్చున్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పట్టణ, మండల అద్యక్షులు శరత్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. **బొండపల్లి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయాల వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి పార్టీ శ్రేణులు శుక్రవారం బాబుతో నేను అంటూ సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం గజపతినగరం వరకు బైక్ ర్యాలీగా చేరుకొని ఎన్.టి.ఆర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోరాడ కృష్ణ, బండారు బాలాజీ, బుద్దరాజు నరసింహ వర్మ పాల్గొన్నారు.

నెల్లిమర్ల.. ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

సారిపల్లిలో ఇంటింటికి టిడిపి ప్రచారం

నెల్లిమర్ల: చంద్రబాబు అరెస్టు పై శుక్రవారం టిడిపి నాయకులు ఇంటింటికి సారిపల్లిలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు మహంతి చిన్నంనాయుడు, సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, మహంతి శంకర్రావు, కలిశెట్టి సీతారాం, దన్నాన రామ్మూర్తి, బి ఆదినారాయణ మాస్టర్, సారిపల్లి బాబురావు, సారిపల్లి గోపి, పి వెంకట్రావు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతి రైతూ ఇ- క్రాపు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని నరవ ఆర్‌బికెను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు ప్రతి రైతు ఈ క్రాప్ పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకున్న వారికి భవిష్యత్తులో ఇన్సూరెన్స్, పంట నష్టం వర్తిస్తుందన్నారు. ఈ క్రాపు చేసుకోని రైతులకు పంట నష్టం, ఇన్సూరెన్స్, ధాన్యం కొనుగోలు చేయడం జరగదన్నారు. ప్రతి రైతు పంట ధ్రువీకరిస్తూ సర్వే నెంబర్‌ను పరిశీలన చేసుకుని వేలిముద్రలు వేసుకోవాలన్నారు. మండలంలోని కొన్ని ఆర్‌బికెలకు వారంలో యూరియా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్యామ్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చామలాపల్లి సర్పంచ్ సూర్యారావు ఆరోపించారు. శుక్రవారం మండలంలోని ఆలుగుబిల్లి పంచాయతీ పరిధిలో మెస్సర్స్ ఆదిత్య అగ్రిగేట్స్‌కి సర్వేనెంబర్ ఒకటిలో సుమారు 15ఎకరాల్లో సంవత్సరానికి ఒక లక్ష క్యూబిక్ మీటర్ల మైనింగ్ చేయటానికి ఎన్వరాల్ మెంట్ ఇంజనీర్ సరిత అధ్యక్షతన డిఆర్ఒ అనిత ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. క్వారీ బాస్టింగుల అనుమతుల కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు పర్యావరణ పరిరక్షణ సభ్యులు, ఏపీ ప్రజా సంఘాల నాయకులతో పాటు స్థానిక సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా చామలాపల్లి సర్పంచ్ జుత్తాడ సూర్యారావు మాట్లాడుతూ ఈ క్వారీలకు అనుమతులు ఇవ్వడం వల్ల చామలాపల్లి గ్రామానికి ఎక్కువగా నష్టం జరుగుతుందన్నారు. ఆలుగుబిల్లి క్వారీల యాజమాన్యాలు కంప్రెసర్ ద్వారా రంధ్రాలు చేయకుండా రిగ్గింగ్ మిషన్ ద్వారా సుమారు 100 నుండి 150 అడుగుల వరకు రంధ్రాలను చేసి భారీ పేలుళ్లు చేస్తున్నారన్నారు. వీటి వల్ల ఇండ్లకు బీటలు వారు ఉన్నాయని, బ్లాస్టింగ్ వల్ల వచ్చే దుమ్ము ధూళితో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని పలుమార్లు తహశీల్దార్ శ్రీనివాసరావుకి ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. క్వారీ యాజమాన్యాలు మాత్రం మీకు దిక్కున చోట చెప్పుకోండి అని తిరిగి బెదిరింపులకు దిగుతున్నారని జిల్లా అధికారులైనా క్వారీ యజమానులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆలుగుబిల్లి ఎంపిటిసి రాయవరపు చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ గ్రామానికి రోడ్లు వెడల్పు చేసి తాగునీరు అందించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సూర్యారావు

కళాసీ ఛార్జీలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ధాన్యం కొనుగోలకు సంబంధించిన కళాసి ఛార్జీఇలను వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం లెక్కిడాం పిఎసిఎస్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021-22 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కళాసి ఛార్జీలను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఛార్జీ సొమ్ము రూ. 22.58 లక్షలు సివిల్ సప్లయ్ చెల్లించి సంవత్సరం అయినప్పటికీ రైతులకు ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా రైతు సంఘం ఆందోళన చేపట్టి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని కలెక్టర్ డిసిఒలకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ పిఎసిఎస్ సొసైటీలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. లక్కిడాం సొసైటీ పరిధిలో ఉన్న బుడతనాపల్లి, చంద్రంపేట, లెక్కిడాం, పెద్దవేమలి, నీలావతి గ్రామాల రైతులు ధర్నా చేసి పిఎసిఎస్ కార్యదర్శి గులిపల్లి రామకృష్ణకు వినతిపత్రం అందజేశామన్నారు. కొనుగోలు కేంద్రాలకు జిల్లా కేంద్రం సర్క్యులర్ పంపించి సంవత్సరం అయినప్పటికీ కళాసి ఛార్జీలను రైతులకు అందచేయలేదన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కళాసి చార్జీలను రైతులు పెట్టుబడి పెట్టుకుని మిల్లులకు తరలించార న్నారు. జిల్లాలోని ఏ కొనుగోలు కేంద్రమూ ఇంత వరకూ కళాసి ఛార్జీలను చెల్లించలేదన్నారు. తక్షణమే కళాసి ఛార్జీలు చెల్లించకపోతే పోరాట ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి పవన్ కుమార్, బుడతనాపల్లి పాల సొసైటీ అధ్యక్షులు అప్పలనాయుడు, చల్ల పెంటయ్య, ఎర్రి నాయుడు, బండారు అప్పలనాయుడు, ఎలిశెట్టి సత్యనారాయణ, పెద్ది నాయుడు, పెంటపల్లి సత్యనారాయణ, చుక్క రామారావు తదితర రైతులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు, రైతులు

ఖాళీ చేయించలేదని ఆగ్రహం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని బైరెడ్డిపాలెం గ్రామంలో పాఠశాల ఖాళీ చేయించలేదని ఆర్‌డిఒ సూర్య కళ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాఠశాల విమానాశ్రయం నిర్మాణంలో తొలగించాల్సి ఉంది. శుక్రవారం ఆమె పాఠశాలకు వచ్చి పాఠశాల ఎందుకు ఖాళీ చేయించలేదని విఆర్ఒ శ్రీనివాసరావు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాఠశాల తొలగించాల్సి ఉందన్న విషయం అధికారులు దృష్టికి తీసుకు వెళ్ళవా లేదా అంటూ ప్రశ్నించారు. అనంతరం ఎంఇఒ రమణమూర్తితో మాట్లాడుతూ విమానాశ్రయం మాస్టర్ ప్లాన్ చాలా రోజులైందని తొలగించాల్సి ఉన్నప్పటికి విద్యార్థులను వేరే చోటికి ఎందుకు తరలించలేదని ప్రశ్నించారు. నాలుగైదు రోజుల్లో విద్యార్థులను వేరే చోటుకు తరలిస్తామని వైసిపి మండల అధ్యక్షులు ఆర్‌డిఒను కోరడంతో త్వరగా పూర్తి చేయాలని ఆమె చెప్పారు. సర్పంచ్ బైరెడ్డి రాజు, తహశీల్దార్ బంగార్రాజు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి సురేష్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడలలో భాగంగా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు, ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. జగదీశ్వరరావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు జి లక్ష్మణరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని, మానవ జీవితంలో క్రీడలు కూడా ఒక భాగమేనని, క్రీడల సర్టిఫికెట్స్ వల్ల అటు చదువులకు, ఇటు ఉద్యోగాలకు రెండు శాతం క్రీడా కోటా కూడా ఉందనిగుర్తు చేశారు. అనంతరం క్రీడా కోఆర్డినేటర్ శ్రీరాములు మాట్లాడుతూ ఈ మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో 12 పాఠశాల నుండి 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఈ ఎంపిక పోటీల్లో అండర్ 14,17 బాలురు, బాలికలను ఎంపిక చేస్తున్నామన్నారు. ఎంపికైన క్రీడాకారులను త్వరలో జరగబోవు నియోజకవర్గ స్థాయి పోటీల్లో మండలానికి ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్ లు మొహమ్మద్ అస్లాం, ఆర్ మోహన్ రాజు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు పత్ర ద్రావణం

గుర్ల : వరి పంటలను ఆశించే చీడ పీడల నివారణకు ప్రకృతి పత్ర ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ కార్యకర్త పిల్ల రాజేశ్వరి అన్నారు. శుక్రవారం గరిడ పంచాయతీ, బడారిపేట గ్రామంలో పొట్నూరు ఎల్లమ్మ, ధర్మాన దేవతమ్మ అనే రైతులతో 200లీటర్ల పత్ర ద్రావణం తయారు చేశారు. వరిలో వచ్చే పచ్చ పురుగులు, ఆకు చుట్ట పురుగులు, కాండం తొలిచే పురుగులు నివారణకు ఈ ద్రావణం ఉపయోగపడుతుందన్నారు. 200లీటర్ల డ్రమ్ములో 25రకాల ఆకులు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకు కాడలు వేసి 5-7 రోజులు మురుగునట్లయితే పలు పత్ర ద్రావణం తయారు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బాడంగి: వరి పంటలో తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ శిరీష అన్నారు. మండలంలోని పాల్తేరు గ్రామంలో శుక్రవారం ఆమె రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాము పొడ తెగుళ్ల గమనించి వాటి నివారణకు హెక్సకొనాజోల్ -2 మిల్లీలీటర్ల నీటికి కలిపి మొదలు తడిచేలా పిచికారి చేయాలన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులు ఉధృతి వల్ల ఆకులు ముడుచుకుని పోయి వంకర పోయినట్లు ఉంటే ఇమిడాక్లోప్రైడ్, తామర పురుగులు గమినించి నట్లయితే ఫిప్రోనిల్ మందుని పిచికారీ చేయాలన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- బొబ్బిలి

అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పల నాయుడు అన్నారు. శుక్రవారం బొబ్బిలి మున్సిపాలిటీ మల్లంపేటలో సుమారు రూ.12.75 లక్షలతో నూతనంగా నిర్మించబోయే సి.సి.రోడ్లు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు. నిరంతరం ప్రజా క్షేత్రంలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకొని దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ ఛైర్మన్ గొలగాన రమాదేవి, బుడా ఛైర్మన్ ఇంటి పార్వతి, గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, బొబ్బిలి పట్టణ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు, కౌన్సిలర్లు తెంటు పార్వతి, కొర్లపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

నేడు గ్రామాల్లో వైద్య శిబిరాలు

కొత్తవలస : వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో గల ముసిరాం సచివాలయంలో శనివారం జగనన్న మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. పిహెచ్‌సిలో శుక్రవారం సర్పంచ్ చింతల పైడిపునాయుడు, ఎంఇఒ బి. శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది వైద్య సిబ్బంది, వాలంటీర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపిపి స్కూల్‌లో ఏర్పాట్లుని ఎంపిడిఒ పరిశీలించారు. **వేపాడ:** మండలంలోని కొండగపూడి పంచాయతీ పరిధిలో గల మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలను జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ పట్నాయక్. పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి సక్రమంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. **నెల్లిమర్ల:** నగర పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్న శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలను కమిషనర్ బాలాజీ ప్రసాద్, యుపిహెచ్‌సి డాక్టర్ సమీరా శుక్రవారం పరిశీలించారు. అనంతరం పద్మశాలి వీధిలో చేపడుతున్న జగనన్న సురక్ష సర్వేను వారు పరిశీలించి పలు సూచనలు చేశారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి ఎన్. ఉమాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని పలు శాఖల పైన నివేదికలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్, అగ్రికల్చరల్, జగనన్న సురక్ష, జగనన్న లే అవుట్‌ల మీద ప్రత్యేకంగా సమీక్షించారు. పలు ఎలక్ట్రికల్ మీద చర్చగా పాడైన స్తంభాలు, లోవోల్టేజ్ ప్రాబ్లమ్ మండలంలో పలు గ్రామాల్లో ఉన్నందున ఈ సమస్యలు త్వరగా పరిష్కరించాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు కోరారు. బొబ్బిలి రూరల్ డిఇ యం భాను నాయుడు, మండల ఎఇ జోగి నాయుడు 15 రోజుల్లో ఈ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ, తహశీల్దార్ రత్నకుమార్, వైస్ ఎంపిపి రమాదేవి, అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు

90 యూనిట్ల రక్తం సేకరణ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముక్కాం సమీపంలోని మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, కృత్రిమ మేదస్సు విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగం పిఒ చల్లా త్రినాథ్ మాట్లాడుతూ ఏటా కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఒక్కరోజే 95 యూనిట్లు సేకరించి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ఇచ్చామన్నారు. కళాశాల డీన్ శ్రీనివాస్ బెహరా మాట్లాడుతూ అత్యవసర సమయంలో ఒక యూనిట్ రక్తంతో ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. అందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి- డెంకాడ

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల పూర్తయిన సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు, ఎంపిపి బంటుపల్లి వెంకటవాసు దేవరావు ఆధ్వర్యంలో ధర్మపురిలో చైర్మన్ ఇంటి వద్ద శుక్రవారం ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, నాగవంశం రాష్ట్ర డైరెక్టర్ బోని అప్పలనాయుడు, రాష్ట్ర ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ డైరెక్టర్, సర్పంచులు లెంక లక్ష్మణ రావు, సువ్వాడ రమేష్, కోరాడ కనకరాజు, పైలా ముత్యాలరావు, ఈశ్వరరావు, సరగడ బంగారు రెడ్డి, దిండి అప్పారావు, కోదాడ కోటి నాయుడు, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవితంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రామభద్రపురం: సంపూర్ణ ఆరోగ్యం ప్రశాంతమైన జీవితంతోనే సాధ్యమవుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అన్నారు. శుక్రవారం ప్రపంచ హృదయ దినం సందర్భంగా రోటరీ ఆధ్వర్యంలో నాయుడువలసలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన శైలి ప్రభావం, మితిమీరిన ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, నిద్ర లేమి, వంటి కారణాలతో చాలామంది గుండె జబ్బులు బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'లెండి'లో వ్యక్తిత్వ వికాస తరగతులు

డెంకాడ: మండంలోని జొన్నాడ లెండి ఇంజనీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస తరగతుల్లో భాగంగా శుక్రవారం విద్యార్థుల కోసం నిర్వహించిన 'ఎ టాక్ ఆన్ యూ ఆర్ ది మాస్టర్ ఆఫ్ యువర్ డెస్టినీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వధర్మ మందిరం - మూవ్ ఆన్ ఇండియా వ్యవస్థాపకుడు, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు అజిత్ కుమార్ ఆచార్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో పఠన సామర్థ్యంతో పాటు భావోద్వేగ మేధస్సు పెంపొందించాలని, అందుకు ఇంజినీరింగ్ విద్యతో పాటు అంతర్గత ఇంజినీరింగ్ భావాలను కలిగి ఉండాలన్నారు.

క్లాప్ మిత్రలకు సన్మానం

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న క్లాప్ మిత్రలను ఎంపిడిఒ వై. పద్మజ, ఇఒపిఆర్‌డి కర్రీ ధర్మారావు, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పాలకవర్గం శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పారిశుధ్య పనులు క్లాప్ మిత్రాలు చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. క్లాప్ మిత్రులకు రాష్ట్ర ప్రభుత్వం సన్మానించడం ద్వారా విలువను పెంచిందన్నారు. సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ మిత్రాలకు సన్మానించడం ఆనందాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ మేస్త్రి ప్రసాద్, క్రాప్ మిత్రాలు, పంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని కుంపల్లిలో శుక్రవారం స్వచ్ఛ సేవాభారత్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, గుంతలలో మురికి నీరు నిల్వ ఉండకుండా చేయడం పై ప్రచారం చేశారు. అనంతరం గ్రామంలో పనిచేస్తున్న క్లాప్ మిత్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పంచాయతీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి- డెంకాడ

అక్టోబరు 1న ఆదివారం మండల పరిషత్తు కార్యాలయంలో వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నామని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు హాజరవుతారని ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.